## కథ

# మేరేజ్ కౌన్సిలింగ్

**వాణిశ్రీ**

డోర్‌బెల్ మ్రోగింది.

'అమ్మ వచ్చినట్లుంది' అనుకుంటూ జానకి కిచెన్‌లో నుంచి వెళ్ళి తలుపు తీసింది.

అన్నపూర్ణమ్మ లోపలికి వచ్చి "అమ్మమ్మ..వళ్ళంతా హూనమైపోయిందే! తెల్లవార్లూ బస్సులో కూర్చుని, కూర్చుని నడుం పడిపోయింది. ఇక జన్మలో బస్సెక్కను" అంటూ వచ్చి సోఫాలో కూర్చుంది.

ఆమె ముఖం అలసిపోయినట్లు కనిపిస్తోంది.

తల్లి మాటలకు జానకి లోలోన నవ్వుకుంది. ఆమె వచ్చినప్పుడల్లా అలా గొణుగుతూనే వుంటుంది. తీరా బెజవాడలో తమ్ముడు ట్రైన్‌లో ఎక్కిస్తానంటే "వద్దురా..స్టేషన్‌కి ఎవరో ఒకరు రావాలి. నన్ను మళ్ళీ ఆటోలో అంత దూరం తీసుకెళ్ళాలి. బస్సులోపోతే హాయిగా ఇంటి దగ్గరే దిగొచ్చు" అంటుంది.

"సర్లేమ్మా! ముందు ముఖం కడుక్కో, కాఫీ ఇస్తాను. ఆనక స్నానం చేస్తే టిఫిన్ పెట్టేస్తాను. మళ్ళీ నేను ఆఫీసుకి బయల్దేరాలి" అన్నది జానకి.

అన్నపూర్ణమ్మ స్నానం చేసి వచ్చాక ఇంటి దగ్గర సంగతులు అడుగుతూ వంట పనులు చేసుకుంటూ వుంది జానకి.

"శేషు వచ్చాడా?" అడిగింది అన్నపూర్ణమ్మ.

"రెండు వారాలకొకసారి వస్తున్నాడమ్మా! ఆఫీసులో పని ఎక్కువైందట. లేకపోతే వారానికొకసారి వచ్చేవాడు" అన్నది జానకి.

"అంతేలేవే! పెళ్ళయి మూడేళ్ళయింది. మోజు తగ్గదా ఏం? పిల్లాపీచు వుంటే వాళ్ళకోసమైనా వచ్చేవాడు"

తల్లి మాటలు సూటిగా గుండెకు గుచ్చుకున్నాయి.

శేషగిరిని ప్రేమించి పెళ్ళి చేసుకోవడం తల్లికి ఏమాత్రం ఇష్టం లేదు. 'పెళ్ళంటే నూరేళ్ళ పంట. అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు విచారించి చేసుకోమన్నారు పెద్దలు. కానికాలం వచ్చింది. రైల్లో పరిచయమనో, ఆఫీసులో పనిచేస్తున్నాడనో ప్రేమించి పెళ్ళాడ్డం ఎక్కువైంది. ఎల్లాంటి వాడో ఏంటో తెలియదు. కులం, గోత్రం, జాతకాలు చూడ్డం ఏం లేదు. ఏ గుళ్ళోనో తాళి కట్టించేసుకోవడం తర్వాత ఆ పెళ్ళి పెటాకులవడం. ఎన్ని చూడ్డం లేదూ?!' అంటూ పెళ్ళయ్యేవరకూ పోరుతూనే వుంది.

దానికి తగ్గట్టే శేషగిరి హైదరాబాద్ నుంచి బెంగుళూరు వెళ్ళిపోయాడు. ఆ కంపెనీ మంచిదనీ, ప్రమోషన్లు వస్తాయనీ చెప్పాడు. మొదట్లో వారానికొకసారి వచ్చేవాడు. ఆఫీసులో పని ఎక్కువైందనీ, బస్సుల్లో రష్ ఎక్కువైందనీ, ట్రైన్‌లో రిజర్వేషన్ దొరకడం లేదనీ చెప్తూ వస్తున్నాడు.

శేషగిరి హైదరాబాద్‌లో వున్న సంవత్సరమంతా అప్పుడే పిల్లలు వద్దనుకున్నారు. ఇప్పుడు పిల్లలు కావాలనుకుంటున్నా తన కడుపు పండటం లేదు. పోనీ డాక్టర్‌ని కన్సల్ట్ చేద్దామనుకుంటున్నా ఇద్దరికీ తీరిక లేదు.

"ఏం బతుకులే మీవి? మొగుడు అక్కడ! పెళ్ళాం ఇక్కడ? ఏం సుఖం? పిల్లా లేదు పీచూ లేదు. కాస్త డబ్బులెక్కువ వస్తాయని కక్కుర్తి పడ్డం తప్పిస్తే ఏం లాభం? అతగాడు ఇక్కడే వుద్యోగంలో చేరొచ్చుగా!"

అన్నపూర్ణమ్మ జానకి ఆఫీసుకి వెళ్ళేవరకు సణుగుతూనే వుంది. ఆఫీసుకి వెళ్ళాకగూడా తల్లి మాటలు చెవుల్లో గింగురు మంటూనే వున్నాయి. ఆమె మాటల్లో కూడా నిజం వుంది. శేషగిరి డబ్బు మనిషేమో అని ఇప్పుడనిపిస్తోంది. జీతం ఎక్కువని తనని ఒంటరిగా వదిలేసి పోయాడు. అతడు ఎప్పుడు వస్తాడా అని చకోరపక్షిలా ఎదురు చూస్తూ వుంటుంది తను. ఇరవై నాలుగు గంటలు గడవకముందే హడావుడి పడి వెళ్ళిపోతాడు. ఉసూరుమనిపిస్తుంది ప్రాణం. నిజంగానే ఎవరు సుఖపడుతున్నట్లు? డబ్బు సంపాదించడమే సుఖమా?

○○○

"శేషూ! నువ్వు మళ్ళీ హైదరాబాద్ వచ్చెయ్యకూడదూ?" అన్నది జానకి.

శేషగిరి అదోలా చూశాడు.

"మళ్ళీ రావడానికా వెళ్ళింది?"

"జీతం ఎక్కువనేగా వెళ్ళింది?"

"అంతేకాదు ఆ కంపెనీలో అమెరికా వెళ్ళే ఛాన్సుంది"

"అంటే నువ్వు అమెరికా వెళ్తావా?"

"ఊ..."

జానక్కి వళ్ళు మండిపోయింది.

"నన్ను వదిలేసి నువ్వొక్కడివే అమెరికా వెళ్ళిపోతావా?" సీరియస్‌గా అడిగింది.

"కూల్ బేబీ కూల్. నిన్ను వదిలిపోవడం ఏమిటి? అక్కడికి వెళ్ళి నేను గ్రీన్‌కార్డు సంపాదిస్తే నువ్వూ వస్తావు" అన్నాడు శేషగిరి నవ్వుతూ.

"అమెరికా వెళ్ళి నువ్వు గ్రీన్‌కార్డు సంపాదించడానికి ఎన్నేళ్ళు పడుతుంది? అప్పటిదాకా నేను ఏడుస్తూ ఇక్కడ చావాలా? లేదా నేను నా జాబ్ మానేసి నీ వెంట రావాలా?" అన్నది జానకి తీవ్రంగా.

"ఎందుకంత సీరియస్ అవుతున్నావు? మొన్న మీ అమ్మ వచ్చెళ్ళిందని చెప్పావుగా! నీకేదో ఎక్కించి వెళ్ళింది. అందుకే తల తిక్కగా మాట్లాడుతున్నావు"

"మా అమ్మ ఎక్కించడం ఏమిటి? నాకు బుర్ర లేదా? మధ్యలో ఆవిడను అంటావెందుకు?"

"లేకపోతే ఏమిటి నువ్వనేది? కెరీర్ చూసుకోవద్దా! అంతా అమెరికా వెళ్ళి ఎలా ఎంజాయ్ చేస్తున్నారు"

"శేషూ! మనల్ని అందరితో పోలుస్తావెందుకు? ఇద్దరూ సాఫ్ట్‌వేర్ వాళ్ళయితే అది వేరు. నువ్వు వెళ్ళిపోతావు బాగానే వుంది. అక్కడ నాకెవరిస్తారు జాబ్?"

"నీక్కూడా ఎందుకు జాబ్? నాది చాలు. గెటాన్ కావొచ్చు"

"అంటే నేను నా సంపాదన వదులుకుని నీ వెంట రావాలా? అక్కడ నీమీద ఆధారపడి బతకాలా? నో..నో..నాకలా ఇష్టం లేదు"

"వాట్?"

"అవును శేషూ! పెళ్ళికాక ముందు ఎన్ని కబుర్లు చెప్పావు? ఇద్దరికీ హాయిగా జాబ్ వుంది. బ్యాంక్ బ్యాలన్స్ పెంచుకుని, సొంత ఇల్లు కట్టుకుని.."

"స్టాప్..స్టాప్ జానకీ..ఇప్పుడేమైందని వర్రీ అవుతు

న్నావు?" సీరియస్‌గా అన్నాడు శేషగిరి.

"ఏమైందా? అప్పుడు అనుకున్న మాటలన్నీ గాలికి వదిలేసి నీ కెరీర్ ముఖ్యమనుకుంటు న్నావు? అక్కడ నువ్వు ఇక్కడ నేను ఏం సుఖం? మనకి పిల్లలు కూడా లేరు. పిల్ల లుంటే వాళ్ళని చూసుకుంటూ ఒంటరి జీవితాన్ని మర్చిపోయే దాన్ని."

"పిల్లలు లేకపోవడానికి నేనా కారణం?"


"మరి నేనా?"

"ఏమో ఎవరికి తెలుసు?"

"తెలుసుకోవడానికి ప్రయత్నం చేయాలి గదా! డాక్టర్ని కలవడానికే తీరిక లేదు మనకి" వ్యంగ్యంగా అన్నది జానకి.

"ఛీ..ఛీ..నెలరోజుల తర్వాత వస్తే ఏం సుఖం లేకుండా చేస్తున్నావు?" విసుగ్గా అంటూ డ్రెస్ చేసుకుని బయల్దేరాడు శేషగిరి.

"సుఖం బార్‌లో దొరుకు తుంది వెళ్ళు" సీరియస్‌గా అన్నది జానకి.



ooo

బెంగుళూరు నుంచి ఫోన్ చేశాడు శేషగిరి.

"జానకీ మా కంపెనీ వాళ్ళు నన్ను అమెరికా వెళ్ళమంటున్నారు. వీసాకి అప్లయ్ చేస్తున్నాను"

"హైదరాబాద్ ఎప్పుడొ స్తున్నావు?"

"ఫ్రై డే నైట్ బయల్దేరుతు న్నాను"

"ఇక్కడ లాయర్‌తో మాట్లాడి విడాకులకు ఏర్పాటు చేస్తాను. నువ్వొచ్చాక ఇద్దరం కల్సి వెళ్దాం" చెప్పింది జానకి.

"జానకీ ఏం మాట్లాడుతు న్నావు?"

"నిజమే మాట్లాడుతున్నాను శేషూ! బీ ప్రాక్టికల్. అసలు నీకు నామీద ప్రేమ వుందా?"

"లేదని ఎందుకనుకుం టున్నావు?"

"నామీద కంటే కెరీర్‌మీదే నీకు ఎక్కువ ప్రేమ వుందని నేను అనుకుంటున్నాను"

"కెరీర్ నా ఒక్కడి కోసమేనా? అందులో నీకు భాగం లేదా?"

"ఏం భాగం వుంటుంది? నువ్వు అమెరికా వెళ్తావు. అక్కడ ఐదారేళ్ళుంటేగాని నీకు గ్రీన్‌కార్డు రాదు. అప్పటివరకు నేను ఇక్కడ ఒంటరిగా వుండాలి. ఈ ఐదేళ్ళలో నువ్వు అక్కడ ఏ కొలీగ్‌తోనో ఆకర్షణలో పడవని గ్యారంటీ వుందా?"

"అంటే నేను అంత చపలచిత్తుడనా?"

"మనిషే చంచల స్వభావం కలవాడు. పరిస్థితులు ఎలా మారతాయో? అదంతా ఎందుకు శేషూ! నాకు డైవోర్స్ ఇచ్చిపో" జానకి విసుగ్గా ఫోన్ పెట్టేసింది.

ooo

శనివారం ఉదయమే వచ్చాడు శేషగిరి. జానకి అతనితో మాట్లాడలేదు. ముభావంగా వుంది. యాంత్రికంగా కాఫీ కప్పు ఇచ్చింది. స్నానం చేశాక టిఫిన్ పెట్టింది.

"లాయర్ పదింటికి రమ్మన్నాడు" బాత్‌రూమ్‌లోకి వెళ్ళబోయే ముందు చెప్పింది జానకి.

శేషగిరి సీరియస్‌గానే తల వూపాడు.

తొమ్మిదిన్నరకి జానకి డ్రెస్ చేసుకుని రెడీ అయింది. శేషగిరి ఆమె వైపు ఆశ్చర్యంగా చూశాడు. తనను ప్రేమించి పెళ్ళి చేసుకున్న జానకి తనంతట తనే విడాకులు ఇమ్మని కోరడం తనకు మింగుడు పడడం లేదు. అందుకు ఎంతో మధనపడుతూ, విచారంగా

వుంటుందనుకున్నాడు. జానకిలో అటువంటిదేమీ కనిపించడం లేదు.

ఇప్పుడు జానకిని చూస్తుంటే పెళ్ళికాని అమ్మాయిలా అందంగా ఆకర్షణీయంగా కనిపిస్తోంది అతని కళ్ళకి. ఇప్పుడే బ్యూటీ పార్లర్‌కి వెళ్ళొచ్చినదానిలా మేకప్ చేసుకుంది. ఆ హెయిర్ స్టయిలే ఎట్రాక్టివ్‌గా వుంది. లైట్ బ్లూ షిఫాన్ చీరలో మోడల్‌ని తలదన్నేలా కనిపిస్తోంది. ఆమె ఎద ఎత్తులు, నడుము దగ్గర ముడత పడిన వైనం చూస్తుంటే శేషగిరికి పిచ్చెక్కిపోతోంది.

ఏం జరుగుతోంది? తను రెండేళ్ళ నుంచి దూరంగా వుంటూ వుండేసరికి జానకి మరొకడి ఆకర్షణలో పడిందా? లేకపోతే తనంతట తనే విడాకులు కావాలనేంత ధైర్యం ఎందుకుంటుంది?

"పద శేషూ! ఏంటి ఆలోచిస్తున్నావ్?" అన్నది జానకి హేండ్ బ్యాంగ్ తగిలించుకుంటూ.

"ఏం లేదు" అన్నాడు.

శేషగిరి స్కూటర్ బైటకు తీశాడు. జానకి ఎక్కికూర్చుని లాయర్ అడ్రస్ చెప్పింది.

లాయర్ శ్రీరామచంద్రమూర్తి ఇంటి ముందు స్కూటర్ ఆపాడు శేషగిరి.

ఆఫీసు రూమ్‌లో కూర్చోమన్నాడు అటెండర్. లాయర్‌గారు ఇప్పుడే వస్తాదని చెప్పాడు. ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. కాసేపటికి బైట స్కూటర్ ఆగింది. లాయర్ వచ్చాడేమో అనుకున్నాడు శేషగిరి. కాని వచ్చింది ఎవరో యువకుడు. అతనికి ముప్ఫై ఏళ్ళుంటాయేమో? ఎత్తుగా హేండ్‌సమ్‌గా వున్నాడు. తెల్లటి షర్టు, మెరూన్ కలర్ ప్యాంట్‌లో టక్ చేసుకున్నాడు.

"హాయ్! జానీ..!" అంటూ నవ్వుతూ పలకరించాడు.

"హాయ్ రాజ్!"

"ఎంతసేపయింది వచ్చి?" అడిగాడు అతను.

"ఇప్పుడే ఫైవ్ మినిట్స్ అయింది" చెప్పింది జానకి.

'శేషగిరి అతను ఎవరు? జానకికి ఎక్కడ పరిచయం?' అని ఆలోచిస్తున్నాడు.

"శేషూ! మీట్ మిష్టర్ శ్రీరాజ్. నా కొలీగ్ శేషగిరి" అని ముక్తసరిగా పరిచయం చేసింది జానకి.

శేషగిరి లేచి శ్రీరాజ్‌కి షేక్‌హేండ్ ఇచ్చాడు.

"లాయర్‌గారులేరా?" అడిగాడు శ్రీరాజ్.

"లేరు. ఆయన కోసమే వెయిట్ చేస్తున్నాను" చెప్పింది జానకి.

"డైవర్స్ అఫిడవిట్ ప్రిపేర్ చేయించాడా? లేదా? దానిమీద సంతకం పెట్టేస్తే ఫినిష్. యూ ఆరె ఫ్రీ బర్డ్" అని కొంటెగా చూస్తూ నవ్వి అన్నాడు శ్రీరాజ్.

"అంతేగా" అన్నది జానకి.

"ఐమ్యాక్స్‌లో మార్నింగ్ షోకి టికెట్స్ బుక్ చేశాను. తాజ్ కృష్ణాలో లంచ్‌కి టేబుల్ రిజర్వ్ చేశాను. ఈవెనింగ్ లుంబినీ పార్కు కెళ్ళి లేజర్ షో చూద్దాం. ఆ తర్వాత భగీరథ బోట్ షికారు. టైట్ ప్రోగ్రామ్. ఓ.కె." అన్నాడు శ్రీరాజ్.

"వండ్రఫుల్ రాజ్! ఒక్కరోజులోనే ఇన్ని ప్రోగ్రామ్స్" విప్పారిన వదనంతో అన్నది జానకి.

తను అక్కడ వున్నా లేనట్టే భావించి వాళ్ళిద్దరూ కొత్తప్రేమికుల్లా ఒకరి కళ్ళల్లోకి మరొకరు చూసుకుంటూ కబుర్లు చెప్పుకోవడం చూసి శేషగిరికి కడుపు మండిపోతోంది. అసలు సంగతి ఇదన్నమాట. జానకి ఈ రాజ్ గాడితో తిరుగుతోంది. డైవర్స్ పేపర్లు తన మొఖాన కొట్టి ఈ క్షణం నుంచే వాడితో షికార్లు తిరగడానికి ప్లాన్ చేసుకుందన్నమాట. శేషగిరి మనసు పొయ్యి మీద వుడుకుతున్న అన్నం మాదిరి కుతకుతలాడుతోంది.

శ్రీరాజ్ జానక్కి చేతిని అందించి "పద బైట కాఫీ తాగి వద్దాం" అన్నాడు.

జానకి అతని చెయ్యి పట్టుకుని లేచి నిల్చుంది.

ఇక శేషగిరి తనను తాను కంట్రోల్ చేసుకోలేకపోయాడు. తన కళ్ళెదుటే తన భార్యని పరాయి మగాడు ముట్టుకునే సరికి కోపం తారాజువ్వలా ఎగిసిపడింది. కుర్చీలో నుంచి లేచి వెళ్ళి జానకిని పట్టుకుని ఇవతలకు లాగాడు.

"జానకీ! వాటీజ్ దిస్?" అన్నాడు కోపంతో మండిపడుతూ.

జానకి మందహాసం చేసింది. ఆమె ముఖంలో కోపం కనిపించడం లేదు.

"మిష్టర్ శేషగిరీ! జానకి నేనూ డేటింగ్ చేస్తున్నాం" అన్నాడు శ్రీరాజ్.

"వాట్?"

"యస్. మీరెటూ డైవర్స్ ఇస్తున్నారుగా?"

"ఇస్తే?"

"ఇస్తే ఏమిటి? డైవర్స్ గ్రాంట్ అయిన తర్వాత ఇద్దరం మేరేజ్ చేసుకుంటాం" వ్యంగ్యంగా అన్నాడు శ్రీరాజ్.

"జానకీ ఐతే నువ్వు అంతా ముందుగా ప్లాన్ చేసుకుని వున్నావన్నమాట" కోపంగా అరిచాడు శేషగిరి.

"అవును శేషూ! ప్లానింగ్ లేకపోతే ఎలా?"

"ఐతే ఇతన్ని మేరేజ్ చేసుకుంటావా?"

"చేసుకోక నీ కోసం ఏడుస్తూ కూర్చోమంటావా? ఐనా నువ్వు నాకు డైవర్స్ ఇస్తున్నావు. నీకేంటి బాధ? నేను మరొక పెళ్ళి చేసుకుంటానో లేదో, అవన్నీ నీకెందుకు? నా భవిష్యత్తు గురించి ఎందుకు ఆలోచిస్తున్నావ్? నామీద నీకేమైనా ప్రేమ వుందా?" అన్నది జానకి.

"ఉంది జానకీ. నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను" ఆవేశంతో అన్నాడు శేషగిరి.

"మరైతే ఆమెకు డైవర్స్ ఎందుకిస్తున్నావ్ మిష్టర్ శేషగిరీ?" గంభీరంగా పలికింది లాయర్ శ్రీరామచంద్రమూర్తి కంఠం. ఆయన అప్పుడే ఆఫీసులోకి అడుగుపెట్టాడు.

"నేను ఇవ్వడం లేదు. తనే ఇవ్వమని అడిగింది" అన్నాడు శేషగిరి లాయర్ వైపు తిరిగి.

"ప్రేమించి పెళ్ళి చేసుకున్న అమ్మాయి తనంతట తను డైవర్స్ ఇవ్వమని అడిగిందంటే ఆమె ఎంత క్షోభ అనుభవించి వుంటుందో నువ్వు వూహించగలవా? ఆమెను ప్రేమించి పెళ్ళిచేసుకున్నావు. అందుకోసం నీ పెద్దల్ని ఎదిరించావు. సంవత్సరమైనా తిరగకుండా ఆమెను ఒంటరిదాన్ని చేసి కెరీర్ అంటూ పరిగెత్తావ్. ఇప్పుడు అమెరికా అమెరికా అని కలవరిస్తున్నావ్. ఎందుకు అంత ఆరాటం? నీ జీవితం నీది. నీ సుఖం నువ్వు చూసుకోవాలి. ఎవరితోనో పోల్చుకుని చూసుకోవడం అవివేకం కాదా?" అన్నాడు లాయర్.

శేషగిరి అయోమయంగా లాయర్ ముఖంలోకి చూశాడు.

"అంతస్తులకు అంతేముంది? డబ్బు సంపాదనకు హద్దు ఏముంది? ఈ దేశంలో నూటికి ఎనభైమంది బీద వాళ్ళున్నారు. వాళ్ళతో పోల్చుకుంటే నువ్వెంతో గొప్పవాడివి. దేనికీ కొరత లేని వాడివి. ప్రేమించి పెళ్ళి చేసుకున్నావు. హాయిగా భార్యతో కాపురం చేసుకోక ఎందుకు ఎండమావుల వెంట పరిగెత్తి జీవితంలో మనశ్శాంతి పోగొట్టుకుంటావు?" చెప్పాడు లాయర్.

చెమటలు పట్టిన ముఖం కర్చీఫ్‌తో తుడుచుకుంటూ కుర్చీలో కూలబడిపోయాడు శేషగిరి.

లాయర్ శేషగిరి భుజం మీద చెయ్యి వేసి "పెద్దవాడిని చెప్తున్నాను. రెండేళ్ళు వెనక్కు వెళ్ళు. మళ్ళీ హైదరాబాద్ వచ్చేసెయ్. జానకితో హాయిగా కాపురం చేసుకో" అన్నాడు అనునయంగా.

"మరి జానకి?" జానకి వైపు, శ్రీరాజ్ వైపు చూస్తూ అన్నాడు శేషగిరి.

శ్రీరాజ్ పక పక నవ్వాడు.

"మీ ప్రేమకు పరీక్ష!" అన్నాడు.

"ఇదంతా నా ఐడియానే శేషగిరీ! నాకు తెలిసినంత వరకు ప్రేమించుకుని ఆ తర్వాత విడిపోయిన వాళ్ళు మనశ్శాంతి కోల్పోయి పిచ్చివాళ్ళయిపోతారు. అందుకే దుర్బలులై ఆత్మహత్యలు చేసుకుంటారు. నా దగ్గరకొచ్చే క్లైంట్లను వీలైనంతవరకు కలపడానికే ప్రయత్నిస్తుంటాను" చెప్పాడు లాయర్.

"థాంక్యూ లాయర్‌గారూ!" చిరునవ్వుతో చెయ్యి కలిపి అన్నాడు శేషగిరి.

"ఐతే రాజీపడినట్లేనా?" అడిగాడు శ్రీరాజ్.

"ఇంకా సందేహమా?" జానకి చేతిని తన చేతిలోకి తీసుకుని అన్నాడు శేషగిరి.

"శ్రీరాజ్ జానకి కొలీగ్ కాదు. నా అసిస్టెంట్. అప్పుడప్పుడు ఇలా నాటకాలాడిస్తుంటాను" అని నవ్వాడు లాయర్ శ్రీరామచంద్రమూర్తి.